క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం



ప్రమాదానికి గురైన హోటల్

కంబాలచెరువు : స్థానిక గోదావరి ఒడ్డున మార్కండేయశ్వరస్వామి గుడి పక్కన ఉన్న బృందావనం హోటల్‌లో ఆదివారం అర్ధ రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో హోటల్ పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. యజమాని రాత్రి తొమ్మిది గంటలకు హోటల్ మూసివేసి వెళ్లిపోయాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధ రాత్రి మంటలు చెలరేగి హోటల్‌లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. దీంతో మంటలు మరింత వేగంగా విస్తరించాయి. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు రేపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అడ్వాన్స్‌డ్ ఆర్గానిక్ సింథసిస్ అండ్ ఫార్మాస్యూటికల్స్ ఇన్నోవేషన్ ఫర్ ఏ సూటబుల్ ఫ్యూచర్ అనే సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే, రసాయశాస్త్ర కన్వీనర్ టి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సెమినార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో హైబ్రిడ్ మోడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)లో జరుగుతుందన్నారు. దేశీయ, విదేశీ విశ్వవిద్యాలయాల ప్రముఖ శాస్త్రవేత్తలు ఆర్గానిక్ సింథసిస్, ఔషధ ఆవిష్కరణలు, డ్రగ్ డిస్కవరీ, బయోటెక్నాలజీ, గ్రీన్ కెమిస్ట్రీ వంటి విభాగాల్లో తాజా పరిశోధనలపై ప్రసంగించనున్నారన్నారు. ఇది విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులకు కొత్త ఆలోచనలు పంచుకుని, పరిశోధనలో సుస్థిరమైన మార్గదర్శకాలను తెలుసుకునే గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. పరిశోధకులు తమ పత్రాలను సమర్పించి ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పాల్గొనవచ్చన్నారు.

తెలుగుపాటకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చిన ఎస్పీ బాలు

ధవళేశ్వరం: తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతిని తీసుకువచ్చిన మహనీయుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. రాకా కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని సన్మానించారు. గాలి సుబ్బరాజు ఫౌండేషన్ ఛైర్మన్ గాలి సుబ్బరాజు ,రాకా ప్రధాన కార్యదర్శి జీవి రమణ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్ర మోతు ధర్మరాజు పాల్గొన్నారు.

అన్న సమారాధన

కడియం: స్థానిక పెద్దవీధి వినాయకుడి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. దాతలు, భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ, స్థానిక యువకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అవార్డు అందుకున్న కృష్ణమోహన్

కంబాలచెరువు : స్థానిక నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వరహగిరి కృష్ణమోహన్ రాష్ట్ర ఉత్తమ బ్రాహ్మణ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. గుంటూరు బ్రాడీపేటలో బ్రాహ్మణ సేవాసమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీఎస్ఆర్.కృష్ణమూర్తి, బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, కార్యదర్శి పోతావఝల పురుషోత్తమ శర్మ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

వృద్ధుల పింఛన్ల కోసం రూ.25వేల విరాళం



విరాళం అందిస్తున్న డాక్టర్ హరనాథ్

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ 14 సంవత్సరాలుగా వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలుసుకుని ఆదివారం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబుకి స్థానిక భవ్య స్కిన్ క్లినిక్ అధినేత డాక్టర్ పలివెల హరనాథ్ రూ.25వేల విరాళం అందించారు. క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కో- ఆర్డినేటర్స్ గోసాల బాపూజీ, బొల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

సేవలకు బంక్ కొడితే అడగవచ్చు



పెట్రోల్ బంక్



వాహనాలకు ఉచిత గాలి పెడుతున్న సిబ్బంది

- పెట్రోల్ బంకుల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి

సీటీఆర్ఐ: ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతూ ఉంటుంది. ప్రతి లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు కల్పించకపోతే ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో చాలా పెట్రోల్ బంక్‌ల్లో ఈ సేవలు కానరావడం లేదు. కొన్ని బంక్‌ల్లో టాయిలెట్‌లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల టైర్లలో గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదు. పెట్రోల్ కొట్టించుకున్న తరువాత గాలి పెట్టించుకోవాలంటే సిబ్బంది లేరని సమాధానం చెబుతున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు

తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. నగర పరిధిలో 23 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. బంక్‌ల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. దీనికోసం బంక్ డీలర్ ఆర్‌ఓఆర్ యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మూత్రశాలలు, మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం.

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌నూ యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టరును అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనపుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతోపాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

గాలి ఉచితంగానే..

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

మెడికల్ కళాశాలను సందర్శించిన వైఎస్సార్ మున్సిపల్ వింగ్



ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన వైఎస్సార్ మున్సిపల్ వింగ్

కంబాలచెరువు: వైఎస్సార్ మున్సిపల్ వింగ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జగన్ హయాంలో మెడికల్ కాలేజీలు ప్రారంభం కాలేదంటూ లేనిపోని అజ్ఞానంతో టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలన్నారు. మెడికల్ కాలేజీని 2021లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారన్నారు. అక్కడ మూడు సంవత్సరాలుగా క్లాసులు జరుగుతున్నాయన్నారు. కళ్ల ఎదుట అన్ని కనబడుతున్నా టీడీపీ నాయకులు కాలేజీ బయట ఉన్న చెత్తను చూపిస్తూ అసలు నిర్మాణమే జరగడం లేదు అనడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ముప్పన శ్రీనివాస్, గేడి అన్నపూర్ణం రాజు, దుంపా సురేష్, సాయి పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

కంబాలచెరువు: స్థానిక పుష్కర్‌ఘాట్ వద్ద నున్న గోదావరిలో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మోరంపూడికి చెందిన కింతాడ సతీష్ (28) టైల్ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. సాయంత్రం గోదావరిలో స్నానం చేసేందుకు పుష్కర్‌ఘాట్‌కు వచ్చాడు. ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. సోదరుడు ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు యువకుడి కోసం గాలిస్తున్నారు.

రైతుబజార్లలో కర్నూలు ఉల్లి విక్రయాలు



రైతుబజార్‌లో ఉల్లి కోసం లైన్‌లో నిలిచిన వినియోగదారులు



రైతుబజార్ షాపులలో మహారాష్ట్ర ఉల్లిపాయలపై గోనెసంచి మూతవేసిన దృశ్యం

- కిలో రూ.10కి విక్రయిస్తున్నా నాసిరకం అంటున్న వినియోగదారులు
- మహారాష్ట్ర ఉల్లిపాయల అమ్మకాలు నిలిపివేసిన అధికారులు
- రేటు ఎక్కువైనా నాణ్యమైనవి విక్రయించాలని వినతి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కర్నూలు జిల్లాలో ఉల్లిరైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిపాయలు కొనుగోలు చేసి పదిరోజులుగా జిల్లాలోని రైతుబజార్లలో విక్రయాలు జరుపుతోంది. అయితే కర్నూలు ఉల్లిపాయలు కిలో రూ.10కి విక్రయిస్తున్నా నాసిరకంగా ఉండడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కర్నూలు ఉల్లిపాయలతో పాటు మహారాష్ట్ర ఉల్లిపాయలను కూడా రైతుబజార్‌లలో విక్రయిస్తుంటారు. అయితే కొద్ది రోజులుగా ఉన్నతాధికారులు రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లిపాయలు విక్రయాలు జరపరాదని ఎస్టేట్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో కేవలం కర్నూలు ఉల్లిపాయలు మాత్రమే విక్రయిస్తున్నారు. రూ.10కి కర్నూలు ఉల్లి ఎన్ని కిలోలు అయినా ఇస్తామని రైతులు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కర్నూలు ఉల్లి నాసిరకంగా ఉండడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండవని వినియోగదారులు అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. రైతుబజార్‌లలో షాపుల వద్ద మహారాష్ట్ర ఉల్లిపాయలుపై గోనెసంచులు కప్పి ఉంచడంతో వినియోగదారులు వాటిని విక్రయించాలని రైతులతో వాదనకు దిగారు. ఉల్లిపాయలు ఉన్నప్పటికీ అధికారులు ఆదేశాలు మేరకు కర్నూలు ఉల్లి మాత్రమే విక్రయిస్తున్నామని రైతులు వినియోగదారులకు చెబుతున్నప్పటికీ వినే పరిస్థితి లేకపోవడంతో రైతులు, డ్వాక్రా సభ్యులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్‌వినయ్‌ను 'సాక్షి' అడుగుగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు కర్నూలు ఉల్లిపాయలను రైతుబజార్‌లలో విక్రయిస్తున్నామన్నారు. మరో పదిరోజుల పాటు కర్నూలు ఉల్లిపాయలు విక్రయిస్తామన్నారు. అప్పటి వరకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు మహారాష్ట్ర ఉల్లిపాయలు విక్రయించవద్దని ఆదేశాలు జారీచేశారన్నారు.

ఈ గ్రంథాన్ని జ్యోతిష్య పాఠ్యాంశాల్లో చేర్చాలి



సూర్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న అభిమానులు

సీటీఆర్ఐ: ఉపద్రష్ట సూర్యనారాయణమూర్తి పరిశోధించి రచించిన నామ నక్షత్ర వివేచన గ్రంథాన్ని జ్యోతిష్య పాఠ్యాంశాల్లో చేర్చాలని జ్యోతిష్య పండితులు ప్రభుత్వానికి సూచించారు. 35 ఏళ్ల కృషితో నామ నక్షత్రాలను విశ్లేషిస్తూ రచించిన గ్రంథ పరిచయం స్వాతంత్ర సమరయోధులు పార్కులో ఆదివారం జరిగింది. విశ్రాంత అధ్యాపకులు హెచ్.ఎస్.ఎం కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జ్యోతిష్య పండితులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో రచయిత తెలిపిన విషయాలు, ఇంతకముందు ఎక్కడా ప్రచురితం కాలేదన్నారు. జన్మ నక్షత్రానికి, నామ నక్షత్రానికి సంబంధం లేదని ఈ పుస్తకం వెల్లడించిందన్నారు. కంచి కామకోటి పీఠాధిపతుల మన్ననలు పొందిన ఈ పుస్తకాన్ని, జ్యోతిష్య పండితులు ముహూర్తాలు పెట్టే పురోహితులు ఉపయోగించుకోవచ్చని పలువురు పండితులు వెల్లడించారు. పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్య శాస్త్రి, ఎక్కిరాల రామకృష్ణ, డాక్టర్ దీక్షితుల రామకృష్ణ, పొన్నా సుబ్రహ్మణ్యం సిద్ధాంతి, రేమెళ్ళ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తక పరిచయ కార్యక్రమంలో కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ , దేశిరెడ్డి బలరామనాయుడు, డి. సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు. రచయిత గ్రంథకర్త సూర్యనారాయణ మూర్తిని జ్యోతిష్య అభిమానులు సత్కరించారు.

పడాల ప్రసాద్‌కు గిరిజాల పరామర్శ



పడాల సావిత్రికి నివాళులర్పిస్తున్న గిరిజాల వీర్రాజు(బాబు)

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు పడాల ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల నరసింహారావులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు) పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన వారి మాతృమూర్తి పడాల సావిత్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, సర్కార్‌బాషా, పున్నమరాజు వీర్రాజు పాల్గొన్నారు.

సండే ఆన్ సైకిల్



సండే ఆన్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

కంబాలచెరువు: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'సండే ఆన్ సైకిల్' ర్యాలీ ఆదివారం నగరంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది శారీరక ధృఢత్వం, ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించారు. దీనికి ఏఎస్పీలు యంబీస్.మురళీకృష్ణ, ఎల్.చెంచిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక ధృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం మన మందరి జీవన శైలిలో ప్రతిరోజూ ఎక్కువగా మోటార్ సైకిల్స్, కార్లలో ప్రయాణిస్తున్నామని, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ, శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో అధికారులు వారి సిబ్బంది, ప్రజలతో కలిసి ఫిట్ ఇండియా సైకిల్ ఆన్ సండే ర్యాలీ నిర్వహించాలన్నారు. సైకిల్ ర్యాలీలో ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఓనం వేడుక

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని గోల్ఫ్ భవనంలో మలయాళీ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఓనం–2025 వేడుక ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని మలయాళీ కుటుంబ సభ్యులు 200 మంది పాల్గొని అత్త పూకలం, ఓనం సద్య, అథ్లెటిక్ పోటీలతో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలో మహా బలిచక్రవర్తి వేషధారి సందడి చేశారు.



ఓనం సద్య ముగ్గుతో మలయాళీ మహిళలు



మహాబలి చక్రవర్తి వేషధారితో చిన్నారులు

ప్రభుత్వాసుపత్రిలో బంగారం మాయం

కంబాలచెరువు: ప్రభుత్వాసుపత్రిలో రోగి బంధువు బంగారం మాయమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గండేపల్లి మండలం గుర్రంపాడుకు చెందిన మంగతాయారు మేనత్త ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె తన మేనత్త వద్దకు వచ్చి ఆమెకు సహాయంగా ఉంటోంది. ఈ క్రమంలో మెడలో బంగారం గొలుసు తీసి సంచిలో పెట్టి బాత్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బ్యాగులో బంగారం మాయమైంది. దీంతో ఆమె త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.